క్లుప్తంగా

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి సన్మానం



డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మ

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డిని బుధవారం రిటైర్డ్ నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకటతులశమ్మ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో ఆసుపత్రిలోని అన్ని విభాగాలను తిరిగి సమస్యలు పరిష్కరించేందుకు సహకరించే వారన్నారు. వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పనితీరు విషయంలోనూ ఆయనకు మంచి అవగాహన ఉందన్నారు. అలాంటి వ్యక్తికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, పాల్గొన్నారు.

పార్టీని బూత్‌స్థాయికి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ

కర్నూలు కల్చరల్: బీజేపీని బూత్‌స్థాయిలోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివ నారాయణ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు పార్లమెంట్ ఎన్నికల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టడంతో ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషారెడ్డి, రాష్ట్ర కార్య వర్గసభ్యులు నగరూరు రాఘవేంద్ర, చంద్రమౌళి, సావిత్రి, సాయి ప్రదీప్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులను బాగు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో రహదారులు గుంతలమయంగా మారాయని, వాటిని వెంటనే బాగు చేయాలని సీపీఎం నగర కార్యదర్శులు టి.రాముడు, ఎం.రాజశేఖర్ కోరారు. ప్రస్తుతం చిన్నపాటి వర్షాలు పడితే రోడ్లపైనే నీరు నిలుస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. బుధవారం సీపీఎం బృందం నగరంలోని సుందరయ్య సర్కిల్, గాయత్రీ హాస్పిటల్, అధ్యా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తదితర ప్రాంతాల్లోని రోడ్లను పరిశీలించారు. కొత్త ప్రభుత్వం వెంటనే రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకర్, హుస్సేన్‌వలి, అబ్దుల్లా, కుమారి, పర్వీన్‌లు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

కర్నూలు సిటీ: మానవ మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని మాంటిస్సోరి స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డా.కృష్ణమోహన్, ప్రధానోపాధ్యాయులు రమాజ్యోతి, శ్రీజ్యోతి విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏ క్యాంపు మాంటిస్సోరి సెకండరీ స్కూల్‌లో స్కూల్ గ్రీనీస్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అకడమిక్ డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొని మాట్లాడారు. ఎడారి భూముల పునరుద్ధరణ అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ, చిత్ర లేఖన పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ పాఠశాల కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

22న ఏరువాక పున్నమి వేడుకలు

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఏరువాక పున్నమి వేడుకలను నియోజకవర్గ, మండల స్థాయిల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఎద్దులకు పూజలు చేయడం, సాగు పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

టీకాతో చిన్నారులకు రక్ష



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): టీకాతో చిన్నారుల ఆరోగ్యానికి రక్ష కలుగుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ హౌసెస్ పరిధిలోని రాజీవ్‌నగర్ సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలో అర్హులైన గర్భిణులు, చిన్నారులందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఎంఆర్-1, ఎంఆర్-2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని చెప్పారు. ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఏఎన్‌ఎం హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రక్తహీనత గల గర్భిణిలను సమీప ఆసుపత్రికి రెఫర్ చేసి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇప్పించాలని, ప్రధాన మంత్రి మాతృవందన యోజన లబ్ధిదారుల దరఖాస్తులను పీఎంఎంవీవై పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జననీ సురక్ష యోజన, జననీ శిశు సురక్ష కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఆయన గర్భిణిలకు ఐరన్‌మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, హెల్త్ అసిస్టెంట్లతో పాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా తమ సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎంలు పర్యటించాలని, గుంతలు, టైర్లు, బాటిల్స్, కూలర్లు వంటి వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. క్రమం తప్పకుండా రెండు వారాలకు ఒకసారి ప్రతి ఇంటా పారిశుద్ధ్య పనులు, హైపో క్లోరైడ్ ద్రావణం పిచికారీ చేయాలన్నారు. అలాగే తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ



పరిసరాలను పరిశీలిస్తున్న కర్నూలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల ఆవరణలోని చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఆవరణలోని చెట్లను నరికివేశారని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప, మాల విద్యార్థి సంఘాల అధ్యక్షుడు కె. వెంకటేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పి. రాజీవ్‌కుమార్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం కర్నూలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి చెట్లను నరికివేసిన ప్రాంతానికి వచ్చి విచారణ చేపట్టారు. కొమ్మలు, చెట్లు నరికిన ప్రాంతంలో కొలతలు తీసుకొని పలు అంశాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరికివేతకు గురైన చెట్ల ఎత్తు, వెడల్పు తదితర వాటిని లెక్క కట్టి రికవరీ చేస్తామన్నారు. ఇందుకు కారణమైన వారిపై కూడా వారి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

యాదవులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి



మాట్లాడుతున్న యాదవ సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో బలమైన సామాజిక వర్గమైన యాదవులకు నామినేటెడ్ పదవుల్లో అగ్రస్థానం కల్పించాలని యాదవ సంఘాల నేతలు కోరారు. బుధవారం స్థానిక నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని యాదవ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్నయాదవ్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జేవీ క్రిష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక ఎంపీతో పాటు ఆరు మంది ఎమ్మెల్యేలుగా యాదవులు విజయం సాధించారన్నారు. కర్నూలు జిల్లాలో యాదవులకు ఒక ఎంపీ, ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టి. శ్రీరాంయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, జిల్లా గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావుయాదవ్, మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి యాదవ్, శిరీషయాదవ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆలయ భూముల వేలం పాటలు

మహానంది: బుక్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూముల కౌలుకు వేలం పాటలను బుధవారం ఆలయం వద్ద ఈఓ స్వర్ణముఖి, గ్రూపు దేవాలయాల ఈఓ జనార్దన్‌శెట్టి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. సుమారు 29 ఎకరాల భూముల కౌలుకోసం బహిరంగ వేలాలు నిర్వహించారు. అందులో 15 వరుస నెంబర్లలోని విస్తీర్ణం కలిగిన భూముల్లో జరిగిన సుమారు 15 ఎకరాల భూముల ద్వారా రూ.4,46లక్షలు ఆదాయం వచ్చింది. మరికొన్ని ఎకరాలకు వాయిదా పడ్డాయి. గతేడాది అన్ని భూముల ద్వారా రూ. 4,32,000 వచ్చింది. వాయిదా పడిన భూములకు ఎంతో డిమాండ్ ఉందని, అయితే వాటిని తగ్గించి తీసుకునేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మిగిలిన భూములు వారం రోజుల్లో వేలాలు నిర్వహిస్తామని ఈఓ స్వర్ణముఖి చెప్పారు. అయితే వేలాలకు రావద్దని, ఘర్షణలు జరుగుతాయని కొందరు ఈఓకు సూమాచారమివ్వడం చర్చనీయాంశమైంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, సిబ్బంది చంద్రశేఖర్, పీరయ్య బందోబస్తు నిర్వహించారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి



సోమలగూడూరులో ఉపాధి కూలీలు, రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

నందవరం: జాబ్‌కార్డు ఉన్న ప్రతి రైతు ఉద్యాన పంటలైన మునగ, కొబ్బరి, పూలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని ఏపీడీ అల్లిపీర సూచించారు. బుధవారం మండలంలోని సోమలగూడూరు, నాగలదిన్నె, పెద్దకొత్తిలి గ్రామాల్లో ఉపాధి కూలీలు, రైతులతో ఉద్యాన పంటల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటలకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం రాయితీ కల్పించిందన్నారు. రైతులకు హార్టికల్చర్ పంటల సాగుపై అవగాహన కల్పించామన్నారు. ఉద్యాన పంటల సాగుకు మండలానికి 300 ఎకరాలు టార్గెట్ నిర్ణయించగా ఇప్పటివరకు 87 ఎకరాల్లో తోటలు సాగయ్యాయని వివరించారు. మరో 37 ఎకరాల్లో సాగుకు అంచనా వేశామన్నారు. రైతులు హార్టికల్చర్ పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగించుకోవాలన్నారు. క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ బషీర్ అహమ్మద్, ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, ఫీల్డ్ అసిస్టెంట్లు కృష్ణ, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వివాహాలు

కర్నూలు(సెంట్రల్): అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు ఉచితంగా గురువారం సామూహిక వివాహాలు చేయనున్నట్లు ఆ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, మదీనా హిందీ డిగ్రీ కాలేజీ మహ్మద్ పాషా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని చౌక్‌బజార్‌లో ఉన్న జీబీ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆర్థిక స్థోమత లేని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్) : దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ర్వహించి విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం గోకారి భవన్‌లో ఆయన మాట్లాడుతూ..నీట్ పరీక్షా ఫలితాల్లో 67 మందికి 720కి 720మార్కులు రావడం, అందులో ఆరుగురు హర్యానాలోని ఒకే సెంటర్ నుంచి ఉండడం అనుమానానికి తావిస్తోందన్నారు. తక్షణ ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలన్నారు. నీట్ పరీక్ష దక్షిణాది రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీస్తోందని ముఖ్యమంత్రులు చెబుతున్నా వినకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకెళ్లడం అన్యాయమన్నారు.

భవిష్యత్తు ప్రధాని రాహుల్‌గాంధే

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్ ప్రధానమంత్రి రాహుల్‌గాంధేనని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..దేశ ప్రజలను మోదీ మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, డీసీసీ ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, సత్యనారాయణ గుప్త, పోతుల శేఖర్ పాల్గొన్నారు.

అమ్మ అనాథాశ్రమంలో..

నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న అమ్మ అనాథాశ్రమంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోడుమూరు కాంగ్రెస్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు హాజరై అనాథల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, లాజరస్, ప్రతాపరెడ్డి,సాయి,తిప్పనాయుడు, లక్ష్మణ్‌గౌడ్,మధుపాల్గొన్నారు.

ఇసుక తరలిస్తే చర్యలు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇనగండ్ల గ్రామానికి చెందిన భాస్కర్, సి.బెళగల్‌కు చెందిన తలారి సుధాకర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

తీవ్ర కరువుతో నష్టపోయాం.. ఆదుకోండి

- ముఖాముఖిలో రైతుల విన్నపం
- కోడుమూరులో కేంద్ర బృందం పర్యటన



అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

కోడుమూరు రూరల్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల గత రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలన్నీ ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం.. సాయమందించి ఆదుకోవాలంటూ కేంద్ర బృందం సభ్యులకు రైతులు విన్నవించారు. బుధవారం సాయంత్రం కేంద్ర బృందం సభ్యులు చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్, ఆషిష్ పాండే, అరవింద కుమార్ సోని కోడుమూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంటలు నష్టపోయిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడంతో పాటు, కరువు తీవ్రతను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ముఖాముఖిలో రైతులు విశ్వనాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సీతారాముడు, రామకృష్ణ, ఫణీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసిన పంటలన్నీ ఎండిపోవడంతో కనీసం పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయామని, పాడి పశువులకు కూడా మేతలు దొరకని పరిస్థితి నెలకొందంటూ వాపోయారు. అయితే గత ప్రభుత్వం ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు పరిహారమందించి ఆదుకుందని చెప్పారు. కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ రైతులు చెప్పిన ప్రతి విషయాన్ని నోట్ చేసుకున్నామని, తమ వంతుగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి, డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి, ఆర్డీఓ శేషిరెడ్డి, ఏడీఏ సాలురెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డీఈఈలు మహబూబ్‌ఖాన్, మల్లికార్జున, తహసీల్దార్ గుర్రప్ప పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వండి



త్రోబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజ్ఞానపీఠం కరస్పాండెంట్ గురుమూర్తి

కర్నూలు (టౌన్): చదువుతో పాటు విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞానపీఠం కరస్పాండెంట్ గురుమూర్తి అన్నారు. బుధవారం ఒలింపిక్ సంబరాల్లో భాగంగా నగర శివారులోని స్థానిక విజ్ఞానపీఠం పాఠశాల క్రీడా మైదానంలో బాలురకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలతో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. నిత్యం సాధన చేయాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. తమ పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం సభ్యులు, త్రోబాల్ సంఘం కార్యదర్శి ఎం.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

21 నుంచి జోనల్‌స్థాయి స్కేటింగ్ పోటీలు



జోనల్ పోటీలకు ఎంపికైన స్కేటింగ్ క్రీడాకారులతో కోచ్

కర్నూలు (టౌన్) : ఈనెల 21 నుంచి 24 వరకు తిరుపతి పట్టణంలో జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీలు జరుగుతున్నట్లు జిల్లా స్కేటింగ్ సంఘం ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా నుంచి జయంత్, కృతిక్, మాన్విత్రీ, సాహితీ, శశాంక్, ఆర్యసాయి, దత్త ఎంపికయ్యారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆ క్రీడాకారులను సునీల్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో స్కేటింగ్ కోచ్ అబుబకార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్కేటింగ్, ఫుట్‌బాల్, తైక్వాండో పోటీలు

కర్నూలు (టౌన్) : ఒలింపిక్ డే క్రీడా సంబరాల్లో భాగంగా గురువారం స్కేటింగ్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జోహరాపురం రోడ్డులో ఉన్న లక్ష్మీ టౌన్ షిప్‌లో బాల బాలికల స్కేటింగ్ పోటీలు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయని, అలాగే స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు బాల బాలికలకు ఫుట్‌బాల్, తైక్వాండో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడల్లో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు



అంతర్ పాఠశాలల కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికల జట్లు

కర్నూలు (టౌన్) : క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్, వాలీబాల్, కబడ్డీ, క్యారమ్స్, సెపక్‌తక్రా, టెన్నికాయిట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఎస్‌డీఓ ప్రారంభించి మాట్లాడారు. తరచు పోటీల్లో పాల్గొనడం వల్ల క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు ప్రతిరోజు కొంత సమయం క్రీడా సాధనకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రతినిధులు శుభాకర్, డీఎస్ఏ శిక్షకులు రవి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వయోవృద్ధులు తమ ఆరోగ్యం పట్ల నిరంతరం జాగ్రత్త వహించాలని కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ డాక్టర్ రంగనాయక్ అన్నారు. బుధవారం వయో వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురుబ్రహ్మనగర్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు వైద్యులు చెప్పే ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలిపారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, మితాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజు, మాజీ అధ్యక్షులు సహదేవరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్, అడ్వకేట్ పాపారావు, క్రిష్టఫర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గీతాంజలిలో ఘనంగా ఫేర్‌వెల్



కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కరస్పాండెంట్ పెరుగు విజయవర్దన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాలలో బుధవారం ఎంఎస్సీ నర్సింగ్ 2022-24 బ్యాచ్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఘనంగా వీడ్కోలు(ఫేర్‌వెల్) పలికారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయమోహన్‌రెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ కోర్సు చాలా ముఖ్యమైనదని, పవిత్రమైనదని, రెండు సంవత్సరాలు కష్టపడి కోర్సు ముగించుకున్న విద్యార్థులు అభినందనీయులన్నారు. వారు ఇంకా ఎదిగి భవిష్యలో సమాజానికి మెరుగైన సేవలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసంతకుమారి, అధ్యాపకులు టి. శిరీష, ఎస్. సురేఖ, వై. సురేఖ, నిర్మల, స్వప్న, మనీషా పాల్గొన్నారు.

పర్సు అప్పగింత

పాణ్యం : స్థానిక ఓ హోటల్‌లో భోజనం చేసే సమయంలో వినియోగదారుడు మరిచిపోయిన పర్సును హోటల్ నిర్వాహకులు తిరిగి అప్పగించారు. బుధవారం ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన నరసయ్య కుటుంబంతో కలసి కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న తన పిల్లలను చూసేందుకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో హోటల్‌లో భోజనం చేసి అక్కడే పర్సు మరిచిపోయాడు. అందులో రూ. 15వేల నగదు ఉంది. హోటల్ నిర్వాహకులు పర్సును గుర్తించి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు బాధితులకు సమాచారం అందించి పర్సును అప్పగించారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

నంద్యాల(అర్బన్):పోస్టాఫీసు సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ నాగనాయక్ తెలిపారు. పోస్టాఫీసుల్లో ఖాతాదారులకు అందుతున్న సేవలపై బుధవారం మండలంలోని పోలూరు గ్రామ సబ్ పోస్టాఫీసులో ఎస్‌బీఎం అలీసాతో కలిసి ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్ఐ, ఎస్ఎస్ఏ తదితర పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో అత్యంత నమ్మదగిన పాలసీల సంస్థల్లో పోస్టాఫీసు నమ్మకమైనదని,ప్రతి ఖాతాదారుడు ఆత్మవిశ్వాసంతో పాలసీలు చేయాలన్నారు.

పిల్లలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం



ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్‌యూ వీసీ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్ కుమార్, తదితరులు

కర్నూలు సిటీ: పిల్లలను అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏఐఎస్‌ఈ(ప్రభుత్వ బీఈడీ కాలేజీ)లో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వర్సిటీ వీసీ సుధీర్‌ప్రేమ్‌కుమార్, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.కె.వి. మధుసూదన్, డా.జి.నాగలక్ష్మమ్మ, డా.కళ్యాణ్ కుమార్, ఛాత్రోపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.